ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

■ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్యా దేవరాజన్ ■ దేవరంపల్లి, కొంపల్లి తదితర గ్రామాల్లో సర్వే ప్రారంభించిన అధికారులు

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 4: గ్రామాల్లో నివసించే ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వనున్నట్లు రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్యాదేవరాజన్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన దేవరంపల్లిలో శుక్రవారం ఆమె రంగారెడ్డి కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ డిజిటల్ కార్డు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ ఉపయోగపడతుందన్నారు. అధికారుల సర్వేకు కుటుంబ సభ్యులు సహకరించి వివరాలు నమోదు చేయించుకోవాలని, గ్రూప్ ఫొటో అందించాలని సూచించారు. గ్రామంలో మొత్తం 168 కార్డులు ఉండగా 88 కార్డులను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీవో విఠలేశ్వర్‌జీ, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, డైరెక్టర్ నరేందర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లరూరల్ : దేవరంపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ శశాంక, పక్కన జిల్లా ప్రత్యేక అధికారి దివ్యా దేవరాజన్

వికారాబాద్ : సంబంధిత అధికారులకు సలహాలు, సూచనలు చేస్తున్న సెర్ప్ సీఈవో, జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్

కార్డులు అందించేలా పనిచేయాలి

వికారాబాద్ : ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు అందించే దిశగా అధికారులు పనిచేయాలని సెర్ప్ సీఈవో, జిల్లా ప్రత్యేక అధికారి దివ్యాదేవరాజన్ తెలిపారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొంపల్లిలో డిజిటల్ కుటుంబ ఇంటింటి సర్వే ప్రక్రియను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వే కోసం వచ్చిన అధికారులకు సహకరించాలని కోరారు. డిజిటల్ కార్డు కోసం గ్రూప్ ఫొటో తీసుకోవడానికి అందుబాటులో ఉండి కుటుంబ సభ్యుల సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, ఇడియం మహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

పరిగి : ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు అందించేందుకు చేపడుతున్న సర్వే ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా చేపట్టాలని జిల్లా ప్రత్యేకాధికారి దివ్యా దేవరాజన్ ఆదేశించారు. పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో చేపడుతున్న డిజిటల్ కుటుంబ ఇంటింటి సర్వేను కలెక్టర్ ప్రతీక్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా ఆధార్‌కార్డు వివరాలు, ఫోన్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ నెల 7లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. అవసరమైతే అదనంగా మరో బృందాన్ని సర్వేకు నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్‌డీవో వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చేపట్టాలి

ఆదిబట్ల : ప్రతి ఒక్కరికీ అందించే డిజిటల్ కార్డు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రారంభించిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

నిలువునా ముంచిన కాంగ్రెస్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 4: అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిట్టనిలువునా ముంచిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఆయన ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రూ.రెండు లక్షల పంట రుణమాఫీపై దేవుండ్లపై ఒట్లు వేసి మాట తప్పడాన్ని రైతన్నలు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. సంపూర్ణ రుణమాఫీ అమలు చేయని పక్షంలో కాంగ్రెస్‌ను రైతన్నలే సమాది చేస్తారన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 13 హామీలు నెరవేరుస్తామని, 420హామీల ఆశలు చూపిన కాంగ్రెస్ ఏరు దాటి తెప్పతగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రైతులకు కేసీఆర్ ప్రభుత్వం రంచనుగా ఏడాదికి రెండుసార్లు రైతుబంధు పథకం కింద పంట పెట్టుబడి సహాయం అందించేదని గుర్తు చేశారు. ఏడాదికి రూ.15వేలు రైతులకు, ఎకరానికి రూ.15వేలు కౌలు రైతులకు, రూ.12వేలు రైతు కూలీలకు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకపోవడం సిగ్గు చేటన్నారు. కేసీఆర్ మాదిరిగా రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా, పంటల కొనుగోళ్లు సక్రమంగా చేయాలని, అన్ని పంటలకు క్వింటాల్‌కు రూ.500బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ ఛైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, నాయకులు రమేశ్, యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, అరవింద్, దేవెందర్‌గౌడ్, జానీ పాషా, పున్నంరాము, మహేశ్‌యాదవ్, వంశీ, సాయిగౌడ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా పనులు

వికారాబాద్, అక్టోబర్ 4: ప్రభుత్వ స్థలంలో నుంచి వెంచర్‌కు రోడ్డు పనులు యథేచ్ఛగా సాగుతున్నాయి. అనుమతి లేకుండానే ఓ వెంచర్‌కు ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వేయడంపై ప్రజలు మండి పడుతున్నారు. వికారాబాద్ మండల పరిధిలోని కొటాలగూడ పంచాయతీ పరిధిలోని శిల్ప వెంచర్‌కు ప్రభుత్వ స్థలంలో నుంచి రోడ్డును దర్జాగా వేస్తున్నారు. గతంలో ఇలా చేయడంతో అప్పటి తహసీల్దార్ రోడ్డును ధ్వంసం చేసి ప్రభుత్వ భూమిని కాపాడారు. ప్రస్తుతం అదే స్థలంలో మరోసారి వెంచర్ నిర్వాహకులు యథేచ్ఛగా ప్రభుత్వ స్థలంలో నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ విషయమై మాజీ ఎంపీపీ కలెక్టర్, తహసీల్దార్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడుతామని తెలిపారు.

వెంచర్‌కు ప్రభుత్వ స్థలంలో రోడ్డు పనులు

పోలీసులు నిబద్ధతతో పనిచేయాలి

కులకచర్ల, అక్టోబర్ 4 : పోలీసులు నిబద్ధతతో ప్రజలకు సేవలు అందించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. పోలీసులు ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ రేటు తక్కువగానే ఉందన్నారు. మరింతగా తగ్గించి జిల్లాలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. పల్లెల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై అన్వేశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

ధ్రువపత్రాల పరిశీలనకు నేడు చివరిరోజు

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు

షాబాద్, అక్టోబర్ 4: డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను ఈ నెల 5లోపు పరిశీలిస్తామని డీఈవో సుశీందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 1:3 ప్రకారం మెయిల్ లేదా మొబైల్ ద్వారా సమాచారం ఇచ్చామన్నారు. ధ్రువపత్రాల పరిశీలన జడ్పీ హెచ్ఎస్ బహదూర్‌గూడ (ఎల్బీనగర్ ఎక్స్ రోడ్)లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకోని వారు రంగారెడ్డి జిల్లా వెబ్‌సైట్ <http://deorangareddy.blogspot.com> లో ఉంచిన ఖాళీ ప్రొఫార్మను డౌన్‌లోడ్ చేసుకొని వాటిని పూర్తి చేసి 3 జిరాక్స్ ప్రతులు నమోదు చేయాలన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

వికారాబాద్, అక్టోబర్ 4: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎం కప్-2024 నిర్వహిస్తున్నామని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. జిల్లాలోని క్రీడాకారులు, యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు కలెక్టరేట్ నుంచి టార్చ్ రిలే ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ర్యాలీని ఈ నెల 3న సీఎం ప్రారంభించారని, 4న వికారాబాద్ జిల్లాకు చేరుకుందని తెలిపారు. ఈ ర్యాలీ జిల్లాలోని ఎన్టీఆర్ ఎక్స్ రోడ్ -ఆలంపల్లి-కొత్తగాడి-గేట్ వనంపల్లి ఎక్స్ రోడ్-వెల్చాల్, మొరంగ పల్లి-మోమిన్ పేట్-మేకవనం పల్లి మీదుగా సాగింది. ఇటు నుంచి సంగారెడ్డి జిల్లాకు బయలుదేరుతుందన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో హనుమంతరావు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరపున మధుసూదన్, వెంకటేశ్వర్ రావు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు బాగు

మాట్లాడుతున్న ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఎంఏ సత్తార్

పూడూరు, అక్టోబర్ 4: రైతులు ఆయిల్ పామ్ సాగు తో రైతులు ఆర్థికంగా ఎదగవచ్చని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఎంఏ సత్తార్, రంగనాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇకోపామ్ ఆయిల్, ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగేండ్ల నుంచి పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ దిగుబడి 30 ఏండ్ల వరకు వస్తుందన్నారు. దళారుల ప్రమేయం లే కుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కంపెనీ వారు నేరుగా కొనుగోలు చేస్తారని తెలిపారు. పంట సాగుకు ప్రభుత్వం రాయితీతో పాటు మూడేండ్ల వరకు కంపెనీ ప్రతినిధులు పలు సలహాలు సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారులకు పేర్తు ఇస్తే నేరుగా మొక్కలను నాటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, ఏడీఏ లక్ష్మి, ఎంపీడీవో పాండు, ఇకోపామ్ ఆయిల్, ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధికారి రంగనాయకులు, ఏవో తులసీరాం, ఉద్యాన అధికారి వైజయంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలకు అనుమతి ఇచ్చిన హై కోర్టు

పూడూరు, అక్టోబర్ 4: దామగుండం రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బహుజన బతుకమ్మ నిర్వహించేందుకు హై కోర్టు అనుమతి ఇచ్చింది. దామగుండ అడవిలో నేవీ రాడర్ కేంద్రం ఏర్పాటుపై పలు స్వచ్ఛంద సంస్థలు నిరసన వ్యక్తం చేస్తున్న విదితమే. ఈ ప్రాంతంలో ఎలాంటి సభలు సమావేశాలు నిర్వహించ వద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఈ నెల 6న ఆలయం వద్ద బహుజన బ తుకమ్మ వాల్ పోస్టల్‌తో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతుల కోసం జేఏసీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. ఆదివారం జరిగే బహుజన బతుకమ్మ నిర్వహణకు పోలీసులు బందోబస్తు కల్పించాలని హై కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సబ్ కోర్టు ఏర్పాటు చేయాలి

జిల్లా జడ్జీ శశిధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు, అక్టోబర్ 4: ఆమనగల్లులో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని శుక్రవారం సాయంత్రం ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యుడు జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు యాదవ్, న్యాయవాదులు లక్ష్మణశర్మ, యాదిలాల్, రామకృష్ణ, శేఖర్, మల్లేశ్, శేఖర్, గణేశ్, సంతోశ్, కృష్ణ, సత్యం ఉన్నారు.

అర్ధ వార్షిక ఆదాయంలో రంగారెడ్డి రారాజు

- రూ.80 శాతం టార్గెట్ పూర్తిచేసిన అధికారులు
- రూ.1438 కోట్లు ఆదాయంతో రాష్ట్రంలో టాప్
- హైదరాబాద్ రూ.656 కోట్లు
- రవాణా శాఖ వివిధ పన్నులు, సేవలతో ఆదాయం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, ఆర్టీఓ సుభాష్ చందర్ రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అర్ధ వార్షిక ఆదాయంలో రంగారెడ్డి రారాజుగా నిలిచింది. రాష్ట్రం మొత్తం ఆదాయంలో 45 శాతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే సమకూరింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అర్ధ వార్షిక ఆదాయం రూ.1436 కోట్లు సమకూరిందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. కాగా, ఈ ఏడాది వార్షిక ఆదాయం రూ.1792 కోట్లు. ఇందులో ఇప్పటికే రూ.1436 కోట్లు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రం మొత్తం ఆదాయం రూ. 3195 కోట్లు ఆదాయం రాగా, అందులో 45 శాతం ఉమ్మడి రాష్ట్రానిదేనని తెలిపారు. ఉమ్మడి జిల్లాలు రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్‌లు సంయుక్తం గా రూ.1436 కోట్ల ఆదాయం సమకూరినట్టు వివరించారు. రంగారెడ్డి జిల్లాలో రూ.802 కోట్లు, మేడ్చ ల్ నుంచి రూ.595 కోట్లు, వికారాబాద్ నుంచి రూ.39 కోట్లు సమకూరినట్టు పేర్కొన్నారు. త్రైమాసిక పన్నుల ద్వారా రూ.161 కోట్లు, లైఫ్ టాక్స్ రూ.1120 కోట్లు, ఫీజుల ద్వారా రూ.92 కోట్లు, సర్వీస్ ఛార్జీలతో రూ.21 కోట్లు, గ్రీన్ ట్యాక్స్ రూ.10 కోట్లు, తనిఖీలతో రూ.32 కోట్లు ఆదాయం సమకూరినట్టు వివరించారు. వార్షిక ఆదాయం రూ.1792 కోట్లు కాగా, అందులో రూ.1436 కోట్లు సాధించినట్టు వివరించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు పన్ను చెల్లించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఓవర్ లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్ చందర్ రెడ్డి, ఎంవీఐలు కిరణ్ కుమార్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, అనూష, ఉపాసిని పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన

- పొంగిపొర్లిన వాగులు
- రాకపోకలకు అంతరాయం
- నిలిచిపోయిన ప్రయాణాలు

ధారూరు, అక్టోబరు 4: మండల పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. వర్షం కురవడంతో దోర్నాల్-ధారూరు స్టేషన్ (కాగ్నా) వాగు పొంగి పోర్లుతుండడంతో వాటి మధ్య ఉన్న తాత్కాలిక వాగు వంతెన దెబ్బతిన్నది. దోర్నాల్, అంపల్లి, గురుదోట్ల, నాగారం, కుమ్మరిపల్లి, దోర్నాల్ తండాతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కురిసిన వర్షానికి పంట పొలాలు నీటితో నిండిపోయాయి.

దోర్నాల్-ధారూరు స్టేషన్ మధ్య ఉన్న కాగ్నా వాగు వంతెనపై పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

దెబ్బతిన్న తాత్కాలిక కాగ్నా వాగు వంతెన

మూసీ నిర్వాసితులకు పట్టాలు

- ముసారం బాగ్‌లో 47 మందికి పట్టాల పంపిణీ
- జియాగూడలో 13, ప్రతాప సింగారంలో 34 మందికి..

అంబేద్కర్‌నగర్ బస్తీలో పట్టాలు పంపిణీ చేసేందుకు వచ్చిన సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, ప్రత్యేక అధికారి రాజేశ్ కుమార్, సిబ్బంది

మలక్‌పేట, అక్టోబర్ 4: ముసారం బాగ్ మూసీ పరీవాహక ప్రాంతంలోని నిర్వాసితులకు శుక్రవారం సైదాబాద్ మండల తహసీల్దార్, స్పెషల్ అధికారి రాజేశ్ కుమార్‌ల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. సాయిలు హట్స్‌లో 25 నిర్మాణాలు, అంబేద్కర్ హట్స్‌లో 17 నిర్మాణాలు, ఆది జాంబవంతుని హట్స్, అజయ్ హట్స్‌లలో 26 నిర్మాణాలు(ఇండ్లు) మూసీ రివర్ బోర్డు పరిధిలో ఉన్నట్లు గుర్తించి అధికారులు మార్కింగ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, అజయ్ హట్స్, ఆది జాంబవంతుని హట్స్, అంబేద్కర్‌నగర్ బస్తీలలో గురువారం 16 మందికి పట్టాలు పంపిణీ చేయగా, శుక్రవారం సాయిలు హట్స్‌లో జియాగూడకు వెళ్లేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసిన 13 మందికి, అజయ్ హట్స్‌లో ప్రతాప సింగారం వెళ్లేందుకు అంగీకరించిన 18 మందికి పట్టాలను పంపిణీ చేశారు. ముసారంబాగ్ డివిజన్ పరిధిలో మొత్తం 109 నిర్మాణాలు రివర్ బెడ్‌లో ఉన్నట్లు గుర్తించగా, ఇప్పటి వరకు మొత్తం 47 మందికి పంపిణీ చేశారు. మిగతా వాటిలో కమర్షియల్ నిర్మాణాలు, టెనెంట్స్ ఉన్నట్లు గుర్తించామని, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వబోమని తహసీల్దార్ జయశ్రీ తెలిపారు.

సాయిలు హట్స్‌లో కొత్తగా మరిన్ని నిర్మాణాలు

డబ్బులు తీసుకొని అధికారులు సహకరిస్తున్నారని వారితో స్థానికులు గొడవకు దిగగా, నిర్మాణాలను కూల్చివేసేందుకే మార్కింగ్ చేశామని తహసీల్దార్ వెల్లడించారు. ముసారంబాగ్‌లోని సాయిలు హట్స్‌లో గత నెల 26న సర్వేచేసి రివర్ బెడ్‌లో 25 నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటికి మార్కింగ్ చేశారు. కాగా, శుక్రవారం పట్టాలు పంపిణీచేసి ఖాళీ చేయించేందుకు సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, ప్రత్యేక అధికారి రాజేశ్ కుమార్‌లు సిబ్బందితో రాగా, అందులో అదనంగా మరిన్ని కొత్త నిర్మాణాలు వెలిసి ఉండటం, వాటికి అధికారులు మార్కింగ్ చేసి ఉండటంతో డబ్బులు తీసుకొని వారికి సహకరిస్తున్నారని స్థానికులు అధికారులతో గొడవకు దిగారు. దాంతో కొద్ది సేపు గలాట చోటుచేసుకుంది. రంగ ప్రవేశం చేసిన పోలీసులు వారికి నచ్చజెప్పి పంపించి వేశారు. అయితే, కొత్తగా నిర్మాణాలు వెలిసింది వాస్తమేనని, వాటిని కూల్చివేసేందుకే మార్కింగ్ చేయటం జరిగిందని తహసీల్దార్ జయశ్రీ వారికి తెలిపారు.

హైటెక్ సిటీలో ట్రాఫిక్ ఇక్కట్ల తొలగింపు!

జల మండలి, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల సంయుక్త కార్యాచరణ

సిటీబ్యూరో, అక్టోబరు 4(నమస్తే తెలంగాణ): హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించేందుకు మూడు శాఖల ఆధ్వర్యంలో సంయుక్త కార్యాచరణ చేపట్టారు. మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంత నివాసులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ జాం సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ, జల మండలి, పోలీస్ శాఖలు కలిసి ట్రిడెంట్ హోటల్ నుంచి యశోద ఆసుపత్రి వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. జల మండలి ఎండీ అశోక్ రెడ్డి, సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి కలిసి శుక్రవారం పర్యటించారు. లెమన్ ట్రీ హోటల్ నుంచి ట్రిడెంట్ హోటల్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న నేపథ్యంలో అక్కడున్న ఎయిర్ వాల్వ్‌లను సమీపానికి తరలించడానికి జాయింట్ సీపీతో చర్చించారు. అవి తరలిస్తే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని జాయింట్ సీపీ పేర్కొన్నారు. మాదాపూర్ యశోద ఆసుపత్రి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో ధ్వంసమైన సీవరేజ్ పైపులైన్లను పరిశీలించారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరిస్తామని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

అనంతరం, అధికారుల బృందం పర్వతనగర్ చౌరస్తా నుంచి ఇరువైపులా ఉన్న రెండు మ్యాన్ హోళ్ల నుంచి మురుగు పొంగడం, ప్రతి రోజు ఒక ఎయిర్ టెక్ మిషిన్ అవసరం పడుతుందని గుర్తించి శాశ్వత పరిష్కారంగా పర్వత్‌నగర్ సిగ్నల్ నుంచి రోడ్ నం.45 వరకు కొత్త సీవరేజ్ పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

జనవాసాల మధ్య టపాసుల గోదాం..

టాస్క్‌ఫోర్స్ దాడి

నిర్వాహకుడి అరెస్ట్..

రూ. 15 లక్షల విలువైన క్రాకర్స్ సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): జనవాసాల మధ్య బేగంబజార్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న టపాసుల గోదాంను నిర్వహిస్తున్న శ్యాం యాదవ్ ఖేర్య వాలెను అరెస్ట్ చేసి, రూ.15 లక్షల విలువైన క్రాకర్స్‌ను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డీసీపీ సుధీంద్ర కథనం ప్రకారం.. దసరా, దీపావళికి క్రాకర్స్‌కు మంచి గిరాకీ ఉంటుంది. దీంతో ముందస్తుగానే బేగంబజార్‌కు చెందిన శ్యాం యాదవ్ భారీ ఎత్తున పటాకులు తెచ్చి ఫీల్కానాలో నివాసాల మధ్య ఓ ఇంటిని అద్దెకు తీసుకొని.. అందులో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు.. సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ నేతృత్వంలోని బృందం ఈ గోదాంపై దాడి చేసి పట్టుకున్నారు.